## శ్రీరామ నవమికి అన్ని ఏర్పాట్లు చేయాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ చంద్రమోహన్

అబిడ్స్,మార్చి 26 : శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ చంద్ర మోహన్ అన్నారు. బుధవారం రాత్రి గోషామహల్ ఏసీపీ కార్యాలయంలో ప్రభుత్వ అధికారులతో డీసీపీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామనవని పండుగను ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. శోభాయాత్రలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శోభాయాత్ర రూట్ పర్యవేక్షణ



జియాగూడ, మార్చి 26: శ్రీరామ నవమి శోభాయాత్ర ప్రదేశాలను బుధవారం ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి నేతృత్వంలో సుల్తాన్‌బజార్ నుంచి హనుమాన్ టెక్డీలోని వ్యాయమశాల స్టేడియాన్ని పర్యవేక్షించారు. డీసీపీతో పాటు జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, వివిధ శాఖల అధికారులు శోభాయాత్ర జరిగే ప్రాంతాలను పర్యవేక్షించారు. ముఖ్యంగా సిద్ధింబర్ బజార్ నుంచి హనుమాన్ వ్యాయమశాల వరకు డీసీపీ బృందం సమస్యాత్మక ప్రాంతాలను తెలుసుకున్నారు. శ్రీరామనవమి ఏర్పాటు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి పాల్గొన్నారు.

## ఉస్మానియా దవాఖానలో.. వ్యర్థాల కుప్పలు.. రోగుల తిప్పలు

- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- అవస్థలు పడుతున్న రోగులు

జియాగూడ, మార్చి 26 : దక్షిణాదిలోనే అతిపెద్దదైన ఉస్మానియా ధర్మాసుపత్రిలో అపరిశుభ్రత రాజ్యమేలుతున్నది. ఎక్కడ పడితే అక్కడ చెత్త, వ్యర్థాలు, అపరేషన్ చేసిన రోగుల అవయవాలు దర్శనమిస్తున్నాయి. నిత్యం ఆరు వేల మంది రోగులు, వారి సహాయకులు సందర్శించే ఆసుపత్రిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడం, ఆపరేషన్ థియేటర్లలో రసాయన ప్రక్రియ (కీమికల్ ట్రీట్‌మెంట్) చేయకపోవడంతో రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకుతుండటం పట్ల పలువురు ఆందోళన చెందుతున్నారు. పాత భవనం అరేళ్ల క్రితమే మూసివేయడంతో కులీకుతుబ్‌షాహీ భవనాల్లోనే ఇన్‌పెషెంట్‌లను చేర్చుకుని వైద్య సేవలందిస్తున్నారు.



పాత మార్చురీ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

సూపర్ స్పెషాలిటీ విభాగాల్లోని నిష్ణాణుతులైన వైద్యనిపుణులు కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన వైద్య సేవలందజేస్తున్నారు. మూత్రపిండాల మార్పిడి, కాలేయం, చర్మ మార్పిడి, డయాలసిస్ వంటి కీలకమైన విభాగాల్లో పేద రోగులకు వైద్యులు నాణ్యమైన వైద్య సేవలందజేస్తున్నారు. అయితే వేసవి ప్రారంభంలో ఆసుపత్రిలోని ఓపీ పాత భవనం మార్చురీ వంటి ప్రాంతాల్లో ఎక్కడికక్కడ అక్కడ చెత్త వ్యర్థ్యాలు నిల్వ చేస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారు. ఓపీ క్యాజువల్టీ, అత్యవసర చికిత్స విభాగాలు, మార్చురీ, ఆపరేషన్ థియేటర్, రోగ నిర్ధారణ కేంద్రాలు, రక్త నిధి కేంద్రం, సెంట్రల్ స్టెరైజేషన్ విభాగం, ధోబీఘాట్, వంటశాల తదితర కీలక విభాగాల్లో సంబంధిత ఆర్ఎంవోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపంతో ఆసుపత్రిలోని ఆర్ఎంవోలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సైతం వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి పరిసరాలను శుభ్రపరచాలని పలువురు కోరుతున్నారు.



ఉస్మానియా దవాఖాన ప్రాంగణం

## వైభవంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సొంత నిధులు రూ.15లక్షలతో నిర్మాణం



బతుకమ్మకుంటలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతులు

అంబర్‌పేట, మార్చి 26 : బాగ్అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో చెంచు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సొంత నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన ఈ దేవాలయాన్ని డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెంచు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.హన్మంతు, ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎన్.నాగులు, కోశాధికారి తిరుపతయ్య, సహాయ కార్యదర్శి వెంకన్న, సభ్యులు యు.కుర్మయ్య, ఎన్.కృష్ణ, ఎం.కుర్మయ్య, ఎన్.మహేశ్, జగన్, వెంకటేశ్ తదితరులు ఎమ్మెల్యే, కార్పొరేటర్ దంపతులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీహెచ్ చంద్రమోహన్, పి.గెల్వయ్య, శ్రీరాములు ముదిరాజ్, టి.రమేశ్, ఎం.అరుణ్‌కుమార్‌రెడ్డి, మిర్యాల రవీందర్, సునీల్, చంద్రశేఖర్, శ్రీహరి, నరహరి, సాయి, శేఖర్, బంగారు శ్రీను, యూసుఫోద్దీన్, మిర్యాల శ్రీను, వెంకటరమణ రాజు, స్వర్ణ, అమరావతి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బీసీ నాయకులు

కాచిగూడ, మార్చి 26: బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆరోపించారు. బుధవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో చేసిన కులగణన సర్వే మాదిరిగా.. దేశవ్యాప్తంగా కులగణన జరిగినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కోసం పార్లమెంటు సభ్యుల మద్దతు కోరనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ నాయకులు పాల్గొన్నారు.

## సరస్వతీ నది పుష్కరాల్లో అన్నదానానికి ఏర్పాట్లు



అన్నదాన కార్యక్రమ ఒప్పందపత్రంతో యాద అశోక్‌గుప్తా, మల్లికార్జునరావు, జె శ్రీనివాసరావు తదితరులు

అబిడ్స్, మార్చి 26 : ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ దేవాలయ ప్రాంగణంలో సరస్వతీ నది పుష్కరాలను పురస్కరించుకొని మే 15 నుంచి 26 వరకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్ట్ అధ్యక్షుడు యాద అశోక్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, కోశాధికారి జే. శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉస్మాన్‌గంజ్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమంపై శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్ట్, భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఒప్పందం చేసుకున్నాయి. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి 12 ఏండ్లకోసారి వచ్చే సరస్వతి నది పుష్కరాలకు దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు, ప్రతిరోజూ అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రాకేశ్, కోశాధికారి సీఏ అనిల్‌నాయర్ తదితరులు పాల్గొన్నారు.

## సెపక్ తక్రా వరల్డ్ కప్ విజయంతో ఆనందోత్సాహాలు



సెపక్ తక్రా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రేమ్‌రాజ్‌తో పెరిక సురేశ్, క్రీడాకారులు

అబిడ్స్, మార్చి 26: సెపక్ తక్రా వరల్డ్ కప్–2025లో ఇండియా విజయం సాధించడంతో తమ 27 ఏళ్ల కల సాకారమైందని సెపక్ తక్రా ఫెడరేషన్ ఆల్ ఇండియా సెక్రెటరీ పెరిక సురేశ్ అన్నారు. బుదవారం సెపక్ తక్రా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రేమ్‌రాజ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సెపక్ తక్రా వరల్డ్ కప్‌ను పురుషుల జట్టు గెలుచుకోగా, మహిళల జట్టు రన్నర్‌గా నిలిచి సిల్వర్ మెడల్, డబుల్స్‌లో బ్రౌంజ్ మెడల్ సాధించిందని తెలిపారు. 2017లో గచ్చిబౌలి స్టేడియంలో సెపక్ తక్రా వరల్డ్ కప్ నిర్వహించామని, గత కొన్నేళ్లుగా హైదరాబాదులో సెపక్ తక్రా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇటీవల వరంగల్‌లో సెపక్ తక్రా నేషనల్ గేమ్స్ నిర్వహించామని తెలిపారు. వరల్డ్ కప్ గెలవడం ద్వారా దేశంలోని నలుమూలలకు సెపక్ తక్రా క్రీడలకు ప్రాచుర్యం లభిస్తుందని సురేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ శ్రీనివాస్, సుధాకర్‌రావు, శ్రీకిషన్ బద్రుక, తదితరులు

కాచిగూడ, మార్చి 26: రానున్న రోజుల్లో కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ కమతం శ్రీనివాస్ అన్నారు. బద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్, బద్రుక ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 75వ వార్షికోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కే. శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలను పెం పొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బద్రుక పూర్వ విద్యార్థి ఎన్. సుధాకర్‌రావు, కళాశాల సెక్రటరీ శ్రీకిషన్ బద్రుక, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ,ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌కుమార్, ప్రోగ్రాం కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ జానకిరామ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి

కాచిగూడ, మార్చి 26: అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవల ఆమోదించిన బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నింబోలిఅడ్డ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లు ద్వారా బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల్లో 42 శాతం వర్తింపజేయడం అభినందనీయమన్నారు. బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కోసం అఖిలపక్ష పార్లమెంట్ సభ్యుల మద్దతు కూడగట్టడానికి త్వరలో ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీ సంఘాల సమష్టి పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భూషణ్ భాస్కర్, డాక్టర్ ప్రశాంత్ నేమ్‌కార్, ప్రదీప్‌గౌడ్, కిశోర్, సత్యప్రకాశ్, తదితరులు, పాల్గొన్నారు.

## పలుచోట్ల ఇఫ్తార్ విందులు



మెహదీపట్నం, మార్చి 26 : చాంద్రాయణగుట్ట సమీపంలోని బార్కస్‌లోని నారీనికేతన్ ఓల్డేజ్ హోమ్‌లో బుధవారం మెహిదీపట్నానికి చెందిన ఎంఎం గ్రూప్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ మీర్జా ఇంతియాజ్ బేగ్, సఫియా మాయి తదితరులు పాల్గొన్నారు.



**ఎండీ లైన్స్‌లో..**

కార్వాన్ నియోజకవర్గం టోలిచౌకి డివిజన్ ఎండీ లైన్స్‌లో ఎంఐఎం నాయకులు షేక్ సలీం బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎంఐఎం యువ నాయకులు అబ్దుల్ సలాం ఖాలేది, తదితరులు పాల్గొన్నారు.

**అయోధ్యనగర్ కాలనీలో..**

మెహిదిపట్నం డివిజన్ అయోధ్యనగర్ కాలనీలో బుధవారం రాత్రి మిత్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. మిత్ర అసోసియేట్స్ చైర్మన్ ఏ కృష్ణ ముస్లిం సోదరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, నాయకులు జహంగీర్, విజయ రాజ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



## మెహిదీపట్నంలో ప్రపంచ నీటి దినోత్సవం




మెహిదీపట్నం మార్చి 26 : మెహదీపట్నం నవోదయ కాలనీ దేవల్ ఝున్సింగ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం యాక్షన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నీటి ప్రాధాన్యత కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి ప్రాధాన్యం, ఇంకుడు గుంతల నిర్మాణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొరబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కాచిగూడ డివిజన్ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్



లింగంపల్లి చౌరస్తాలో నీటి సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్, జలమండలి అధికారులు

కాచిగూడ,మార్చి 26 : డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ తెలిపారు. లింగంపల్లి చౌరస్తాలో తాగునీటి పైపులైన్ పగిలిపోవడతో సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్, జలమండలి అధికారులు బుధవారం సంఘటనా స్థలానికి చేరుకుని పగిలిపోయిన నీటి పైపునకు మరమ్మతులు చేయించి అందుబాటులో తెచ్చారు. వేసవిలో డివిజన్ ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రద్ధ వహించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కన్నె రమేశ్ యాదవ్, జలమండలి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, భీమ్‌రాజ్, అరవింద్, వాసు, రవియాదవ్, సూరి, ఓంప్రకాశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

అంబర్‌పేట, మార్చి 26 : ఉపాధి కోసం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కాలాచందర్ ఉపాధి కోసం మంగళవారం సాయంత్రం నగరానికి చేరుకున్నాడు. శివంరోడ్డులోని శాంతి వెజిటేరియన్ హోటల్‌లో పనిచేసే ఒడిశాకే చెందిన తన స్నేహితుడు పాండు వద్దకు వచ్చాడు. తనకు పని కావాలని అడిగాడు. అతను రోటీ మేకర్ కావడంతో ఇప్పుడే తమ వద్ద పని లేదని, మరో రెండు నెలల సమయం పడుతుందని చెప్పాడు. రాత్రి 10.30కి భోజనం చేసి ఇద్దరూ మాట్లాడుకున్నారు. అనంతరం కాలాచందర్ హైటెక్ సిటీలో ఉండే తమ ఊరికి చెందిన బంధువుల వద్దకు వెళ్తానని చెప్పి వెళ్లాడు.

బుధవారం ఉదయం 6 గంటలకు హోటల్ తెరిచే సమయానికి హోటల్ ముందు శవమై పడి ఉన్నాడు. గమనించిన హోటల్ యాజమాన్యం వెంటనే నల్లకుంట పోలీసులకు సమాచారం అం దించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. క్లూస్‌టీమ్,డాగ్‌స్క్వాడ్ బృందా లను రప్పించారు. అయితే అతడికి మద్యం తాగే అలవాటు ఉందని, మంగళవారం రాత్రి బాగా తాగడంతోనే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 'ఉగాది ఆనందోత్సవం' బ్రోచర్ ఆవిష్కరణ

రామంతాపూర్,మార్చి 26 : ఉగాది పండుగను పురస్కరించుకొని ఉగాది ఆనందోత్సవం పేరుతో ఆనంద్ జ్యోతి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి సేవారత్న అవార్డులు ఇవ్వనున్నట్లు స్కూల్ చైర్మన్ కనిగిరి సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. బుధవారం శ్రీనివాసపురంలోనితన కార్యాలయంలో బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవం ఈనెల 30న సాయంత్రం 4 గంటలకు శ్రీనివాసపురం కమిటీ హాల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామంతపూర్, హబ్సిగూడ కార్పొరేటర్లు బండారి వెంకట శ్రీవాణి, చేతన హరీశ్ హాజరవుతారన్నారు.

## కబ్జా భూములపై హైకోర్టు తీర్పును అమలు చేయాలి

- హైకోర్టు న్యాయవాది ఖవి అబ్బాసీ డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది ఖవి అబ్బాసీ

రవీంద్రభారతి, మార్చి 26 : ఎమ్మెల్సీ అమీర్‌అలీఖాన్ తండ్రి జావెద్ అలీఖాన్ కబ్జా భూములపై హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని, వాటిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వక్ఫ్ బోర్డుకు, ఎఫ్‌టీఎల్‌కు అప్పగించాలని హైకోర్టు న్యాయవాది ఖవి అబ్బాసీ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జావెద్ అలీఖాన్ 1996లో రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్ వద్ద వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన 3 ఎకరాల భూమిని, ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన 3 ఎకరాల 10 గుంటల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. ఈ భూముల కబ్జాపై 2022లో తాము హైకోర్టును ఆశ్రయించామని, దీనిపై రెవెన్యూ ఇరిగేషన్,జీహెచ్ఎంసీ, వక్ఫ్‌బోర్డు జాయింట్ విచారణ జరిపి భూ కబ్జా చేసినట్లు తేల్చిచెప్పారని ఆయన గుర్తు చేశారు. దీనిపై ఈనెల 25న రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, ఆయా భూములను కబ్జా నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పేర్కొందని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ భూములను స్వాధీనం చేసుకోవాలని, జావేద్ అలీఖాన్ నిర్మించిన అక్రమ కట్టాడాలను హైడ్రా అధికారులు కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూములను ప్రభుత్వం వక్ఫ్, ఎఫ్‌టీఎల్‌కు అప్పగించాలన్నారు. సమావేశంలో ఇంక్విలాబ్ పార్టీ నేత సబీల్ల ఆజార్, హైకోర్టు న్యాయవాదులు జావేద్ బాసిక్, రిజ్వాన్ ఆష్మీ తదితరులు పాల్గొన్నారు.


## సజ్జత్‌కాలనీలో రోడ్ల ఆధునీకరణ పనులు



మెహిదీపట్నం మార్చి 26 : కార్వాన్ నియోజకవర్గం టోలిచౌకి డివిజన్ సజ్జత్‌కాలనీలో జీహెచ్ఎంసీ సర్కిల్–13 ఇంజినీరింగ్ అధికారులు బుధవారం వీడీసీసీ రోడ్ల ఆధునీకరణ పనులను చేపట్టారు. పనులను ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ ఆదేశాలతో కార్పొరేటర్ ప్రతినిధి మహమ్మద్ హారున్ ఫరాన్ పర్యవేక్షించారు.

**లంగర్‌హౌస్‌లో..**

లంగర్‌హౌస్ డివిజన్ హాశంనగర్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ సర్కిల్–13 ఇంజినీరింగ్ విభాగం అధికారులు బుధవారం పనులను ప్రారంభించారు. పనులను ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమ సిద్ధిఖీ పర్యవేక్షించారు.



## కటోర హౌస్‌లో దోమల నివారణ చర్యలు



మెహిదీపట్నం మార్చి 26 : దోమల బెడదను నివారించడానికి జీహెచ్ఎంసీ సర్కిల్–13 ఎంటమాలజీ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కార్వాన్ నియోజకవర్గంలోని టోలిచౌకి డివిజన్ గోల్కొండలో ఉన్న కటోర హౌస్‌లో డ్రోన్ సాయంతో రసాయనాలను పిచికారీ చేయించారు. పనులను ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ ఆదేశాలతో ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి మహమ్మద్ హారుణ్ ఫర్హాన్ పర్యవేక్షించారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

## పగలు రెక్కీ.. రాత్రి చోరీ
## అంబర్‌పేటలో పాతనేరస్తుడు అరెస్ట్



అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసిన పాతనేరస్తుడు రాఘవేందర్

గోల్నాక, మార్చి 26: పగలు రెక్కీ నిర్వహించి రాత్రి పూట తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అంబర్ పేట పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ పి.మల్లేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ నియోజకవర్గం కేసీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న తాళ్ల రాఘవేందర్(26) సులభంగా డబ్బు సంపాదించేందుకు రాత్రి పూట తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడి విలువైన వస్తువులు, బంగారం చోరీ చేసేవాడు. ఈ క్రమంలో గత ఏడాది జూలైలో అంబర్‌పేట ప్రేమ్ నగర్‌కు చెందిన గోపిరెడ్డి ఇంటితో పాటు, ఈ నెల 21న పటేల్ నగర్‌కు చెందిన చింతల విక్రం ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. దర్యాప్తులో భాగంగా వేలి ముద్రలు, సీసీ పుటేజీల ఆధారంగా బుధవారం కేటీఆర్ నగర్‌లో బైక్ వెళ్తున్న నిందితుడు తాళ్ల రాఘవేందర్‌ను అంబర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా.. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 7 కేసులు ఉన్నట్లు తేలింది. అతడి వద్ద బంగారు అభరణాలతో పాటు రూ.వెయ్యి నగదు, నిందితుడు ఉపయోగించిన యాక్టివాబైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

## అనారోగ్యంతో వృద్ధురాలు మృతి

కాచిగూడ, మార్చి 26: అనారోగ్యంతో వృద్ధురాలు మృతిచెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధురాలు(60) కాచిగూడ శ్యామ్‌బాబా మందిర్ సమీపంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 8712660 542 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఎంబీఏ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఎంబీఏ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల (ఓఎల్సీసీ, పీడీసీ, బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల వార్షిక పరీక్షలను వచ్చే నెల 17 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపారు.

## సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా సభ(డీడీఎంఎస్) లిటరసీ హౌజ్‌లో వివిధ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్ కోర్సులైన ఎంఎస్ ఆఫీస్ ఇంటర్నెట్, ట్యాలీ ప్రైమ్, బ్యూటీషియన్ కోర్సులతోపాటు స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కెరీర్ గైడెన్స్, పైథాన్, టైలరింగ్, డిజైనర్ బ్లౌజెస్, డ్రెస్ డిజైనింగ్, మగ్గం వర్క్, జూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, తదితర కోర్సుల్లో అన్ని వయసుల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. వేసవి నేపథ్యంలో ఏడేళ్లు పైబడిన పిల్లలకు పాట్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, డిజైనర్ పేపర్‌బ్యాగ్స్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, యోగా, ఫ్లవర్ మేకింగ్, జ్యువెలరీ మేకింగ్, తదితర కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి గల వారు వచ్చే నెల 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, గృహిణిలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీట్లు పరిమితమని, ముందుకు వచ్చిన వారికి ప్రథమ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఎటువంటి వయోపరిమితి లేదని, కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 6281139282లో సంప్రదించాలన్నారు.